షోకేసులో బొమ్మ

'కళ్యాణి' దేవి

ప్రపంచ సింహాసనాన్ని జయించినంత వుత్సాహంతో ఇంటినీ ఇంట్లో మనుషుల్నీ ఏకం చేస్తోంది కాంచన.

తనిప్పుడో ఆఫీసర్. కుటుంబంలో మొగాళ్లు నోరు తెరిచేస్తారు. ఆడవాళ్ళు అమ్మో, అమ్మో అని ఆశ్చర్యంతో బుగ్గలు నొక్కేసుకుంటారు. ఇటు తల్లి వైపు కాని, తండ్రి వైపుకాని ఒక్క సారి డైరెక్టుగా ఆఫీసర్ పోస్టులో కొచ్చిన వాళ్లు మొగవాళ్ళలోనే లేరు. ఇక ఆడవాళ్ళలో లేరని వేరే చెప్పాలా?

తండ్రి రామానాధంగారు మాత్రం సగర్వంగా కూతుర్ని చూసుకుని వెండి మీసాలు మెలేశారు.

ఎటొచ్చి కాంచన విజయాన్ని అంతగా పట్టించుకొని విలువ ఇవ్వద

ట్రాకోలేదు ఆమె తల్లి సీతమ్మగారు.

ఏమిటో తండ్రి కూతుళ్లు తెగ సంబర పడిపోతున్నారు. కాని ఆడపిల్లకి అంతలేసి చదువులేమిటి .... వుద్యోగాలేమిటి? మతిమాలిన పన్లు కాకపోతే.... పాతికేళ్లు వస్తున్నాయి- పెళ్ళిగిట్రా చూడకుండా దానితో పాటు మీరు కూడా అలా నిప్పులు తొక్కినట్టు గంతులేస్తారేమి? ఇప్పుడు దానిచేత వుద్యోగం చేయిస్తారు కాబోలు ఖర్మ ఇంటావంటా లేనివనీ తెచ్చి పెట్టున్నారు. దీనికి నేనెంత మాత్రం ఒప్పుకోను." ఖంగు ఖంగున అంటున్నారు సీతమ్మగారు బాబోయ్ .... రక్షించండి నాన్నగారు అన్నట్లు తండ్రివైపు చూసి ఆయన కుర్చీ వెనకాతలకి వెళ్ళి

ప్లీజ్....మమ్మీ....నువ్వెంతో మంచి దానివి కదూ? నన్ను వుద్యోగంలో చేరనియ్యి ఆసలయినా ఆఫీసరయిన కూతుర్ని చూసి నువ్వెంత గర్వపడాలి. నల్గురిలో, ఇంటా, బయటా నా కూతురికి డైరెక్టుగా ఆఫీసర్‌గా పోస్ట్ వచ్చిందని ఎంతో గొప్పగా చెప్పుకోవాలి అబ్బో ఆఫీసర్‌గారి తల్లి వంటె నకెంత గౌరవం, ప్రిస్టేజ్.... అం....బౌనా నాన్నగారు....మీరు మాట్లాడరే" ముందుకి వంగి ఆత్రంగా అన్నది.

"బాబోయ్ అమ్మాయ్ చెప్పింది నిజమే నీకప్పుడు ఎంత హోదా. అంతస్తు ఆఫీసర్‌గారి భార్య హోదాలో పాతపడి పోయావు ఇప్పుడు ఆఫీసర్ గారి తల్లిగా ఘనత కెక్కు. అయినానీ గొడవంతా దాని పెళ్ళి గురించేగా? చూడిప్పుడు ఎంతెంత మంది మనమ్మాయిని చేసుకుంటామని వస్తారో... తొందర పడక మంచి చదువు. హోదా.... మనమ్మాయికి మహా మెచ్చు పైనున్న వారిని తెచ్చి ఘనంగా పెళ్ళి చెయ్యకపోతే నా పేరు రామనాథమే కాదు మనమ్మాయికేం తక్కువని అలా బెంగ పెట్టుకుంటావ్, చూస్తుండు సంబంధాలెలా పరుగుపందేలు వేసుకుని వస్తాయో" ధీమాగా, తను చెప్పిన దానికి ఎదురు లేదన్నట్లుగా చెప్పుకు పోయారు.

కన్న కూతురంత ప్రయోజకురాలయితే ఏ తండ్రికి సంతోషానికి పగ్గాలు వుంటాయి?

"ఏమో బాబు....ఏమిటో ఈ పిచ్చి ధైర్యం మంచి చెడు, బాధ్యత బరువూ నున్న మీకూ చెప్పలేను. అనుభవం లేని దీనికి చెప్పలేను. మధ్య నాకు పట్టింది ఇదంతా. ఖర్మ .... నోరు మూయించి ఏ పదిహేనో ఏభో ఆ మూడు ముళ్ళు వేయిస్తే ఇంత గొడవ వుండకపోను....ఏం చదువులో. వుద్యోగాలో....ఆడపిల్ల కూడా చెప్పిన మాట వినడం పోయింది. అసలు దీనికింత కొమ్ములొచ్చి వినకపోవడానికి కారణం మరింకేం కాదు....తండ్రి మద్దతు....

ఎంత ముద్దయితే మాత్రం...." ఆవిడ వణుగుడు వంటింట్లోంచి సన్నసన్నగా విన్పిస్తూనే వుంది.

తండ్రీ కూతుళ్ళు ఒకళ్ళనొకళ్లు చూసుకుని నవ్వుకున్నారు.

o o o

మరో పదిరోజుల్లో కాంచన ఆఫీసుకి వెళ్లసాగింది. ముందు వూహించినట్లే రామనాథం, సీతమ్మగార్లు ఎక్కడికి వెళ్లినా కూతురి గురించి ఘనంగా, గొప్పగా చెప్పుకోడం తల్లిదండ్రులైనా వీరిని అందలం ఎక్కించటం జరుగుతోంది.

ఆరోజు సీతమ్మగారు గుడికెళ్లారు. గుళ్లో ఇరుగమ్మ,పొరుగమ్మ కల్సారు.

"ఏమండీ సీతమ్మగారు మీ అమ్మాయి ఆఫీసరయిందట కదా? అదృష్టం అంటె మీదేసుమండీ? ఆడపిల్లయినా, మగపిల్లవాడయినా అలా కన్నవాళ్ళకి ప్రయోజకులయి ఆనందం కలిగించాలి. నా రెండోవాడు బి. యస్సీ పూర్తి చెయ్యడానికి మూడు చెరువుల నీళ్లు తాగుతున్నాడు. మమ్మల్ని తాగిస్తున్నాడు, అదృష్టం, అంటే మీదేలెండి...." లోలోపల ఎంత కసుక్కుగా వున్నా పైకి మాత్రం ఎంతో సంతోషిస్తున్నట్లుగా అందరు సీతమ్మగారి దంపతుల అదృష్టాన్ని వేనోళ్ళ పొగిడారు.

"ఔను పెళ్లెప్పుడు చేస్తారు? అబ్బా, కాంచన కంటె పెద్ద పుద్యోగస్తుణ్ణి వెతకాలంటె మాటలా? మళ్లీ కుటుంబ గౌరవాలు, కులగోత్రాలు, ముఖ్యంగా కట్నం ....అయినా ఇవన్నీ మనం చూస్తే కావాలి కాని, పుటుక్కున తన ఆఫీసులో వాళ్ళనెవర్నయినా ప్రేమిస్తే ఈ గొడవలేమి వుండవు....వదినగారికి అసలు బరువు వుండదు...." తనేదో పెద్ద జోక్ వేసినట్లు ఫకాలుమని నవ్వింది, అందర్నీ కలయచూస్తూ ఓ పొరుగమ్మ. మిగతావారు కూడా శ్రుతి కలిపారు.

సీతమ్మగారి మనస్సు ఒక్కసారిగా కలుక్కుమంది. మొహంలో కాంతి తగ్గింది.

ఇంటికెళ్తూనే గుళ్లో అమ్మలక్కలన్న మాటలు చెప్పి "మీరాలస్యం చేస్తే నేనిక ఒప్పుకునేది లేదు. తెల్సీ తెలియని వయస్సు.... వాళ్ళన్నట్టు జరిగితేనా? .... అమ్మో .... ఇంకేదైనా వుందా? మనం నల్గురిలో తలెత్తుకోగలమా? ఏమండీ....నామాట విని అమ్మాయి పెళ్ళి విషయంలో తొందర పడండీ...."

రోజు వింటున్న పోరే అయినా ఆ రోజెందుకో భార్య మాటలు వింటుంటె ఆయనకీ నిజమే అన్పించింది.

రామనాథంగారు అర్జెంటుగా సంబంధాల వేటలో పడ్డారు.

o o o

కాని రామనాథంగారు అనుకున్నట్లు ఏమంత తేలిగ్గా సంబంధాలు దొరక

లేదు. ముందు అందం, ఇతర విష యాలు కంటే పెళ్ళి కొడుకు హోదా ముఖ్యమయి పోయింది.

డబుల్ డిగ్రీలు చదివినా పుద్యోగం లేకపోవడమో, అధవా వుద్యోగంవున్నా అది కాంచన ఆఫీసరు వుద్యోగానికి సరితూగక పోవడమో జరిగింది. పది పదిహేను సంబంధాలు చూసినా దేనికి లంగరు కుదర్లెదు.

పెద్ద పెద్ద వుద్యోగాల్లో, బోలెడు మంది యువకులు వున్నారని భార్యని పూర్కొ పెట్టిన రామనాధంగారికిప్పుడు కాస్తంత కలవరం పుట్టుకొచ్చింది.

ఏమిటబ్బా.... ఇన్ని సంబంధాలు చూసినా పొత్తు కుదరవేమి? ఎలాగ యితే అయిదారు నెల్లు కష్టపడి మంచి వుద్యోగాలున్న అబ్బాయిలకి ప్రాము ఖ్యం ఇచ్చి ఇద్దరు ముగ్గుర్ని పట్టు కొచ్చారు.

ఒక ప్రబుద్ధుడు కాంచన వుద్యో గం, ఆమెను చూసిన తర్వాత ఓఆమడ దూరం పరుగెత్తినంత పని చేశాడు.

"అంత చదువుకొని అంత పెద్ద వుద్యోగం చేస్తున్న అమ్మాయి నా చెప్పు చేతుల్లో వుంటుందా? పెద్దలమీద గౌరవం చూపిస్తుందా? ఈ రోజుల్లో మామూలుగా చదువుకున్న వాళ్ళకే సమాధానాలు చెప్పలేక పోతున్నాం. ఇంత చదివి, ఇంత పెద్ద వుద్యోగం చేస్తూ భర్తని గౌరవిస్తుందా? అలాంటి యక్ష ప్రశ్నల్లాంటివి రామనాధంగార్ని వేసి ఆయన తెల్లబోయి చూస్తుంటే ఒక్క పరుగు తీశాడు.

ఔరా! ఎంతటి ప్రబుద్ధుడు? తన మీద తనకే నమ్మకం లేనివాడుగా కన్పిస్తోంది. ఎంతటి వుద్యోగాలు చేస్తున్నా, ఎన్ని వూళ్ళేలినా భార్య భర్త మాట వినదూ? వినేలా చేసుకోడం తన చేతుల్లో వున్నదని తెలియదుకాబోసు ఈ పెద్ద మనిషికి ...

పుత్తి పిరికిగొడ్డు అని తాటాకులు కట్టింది కాంచన.

మరో హోదా కల్గిన పెళ్లికొడుకు "అందం, చదువు, వుద్యోగం హోదా అన్ని బాగానే వున్నాయి....నా చదువుకి, నావుద్యోగానికి, నాహోదాని చూసి నాకిప్పుడు సంబంధాలు నేనంటె నేనేనని వస్తున్నాయి. ప్రస్తుతం ధర లక్ష పలుకుతోంది. మరి మీరేమంటారు?" అన్న ధోరణిలో మాట్లాడటం చూసి నోరు తెరిచేశారు రామనాధంగారు.

"అదేమిటి నాయనా? నీ గ్రేడ్ వుద్యోగమే చేస్తూ, నీ అంత హోదా, జీతం కలిగిన పిల్లకి కూడా కట్నం కావాలా? పైగా పిల్ల ఎంత లక్షణంగా వుంటుంది" తేరుకుని అడిగారు.

నువ్వో పిచ్చోడివి అన్నట్లు నవ్వి.

"భలేవారండి.... పిల్ల లక్షణంగా వుంది. నాతో చదివి వుద్యోగం చేస్తుం దంటేనే కదా మిగతా సంబంధాలన్ని



వదిలేసి మీ అమ్మాయిని కన్సిడర్ చేస్తోందీ? అది చాలదూ? లక్ష కాక పోయినా ఆ దరిదాపు అంకేదైనా వుందేమో చూడండి....” ఎంతో భూతదయ కల్గిన వాడిలా పోజు పెట్టాడు.

అతగాడి పోజు చూసిన రామనాథం గారికి అరికాలిమంట నెత్తికెక్కింది.

వీడి దర్జా మండిపోను. లక్ష రూపాయలు కావాలా? పైగా సంబంధాన్ని కన్సిడర్ చేశానంటాడా? వీడు కాకపోతే వీడి బాబులాంటివాడు దొరుకుతాడు. పోరా వెధవాయ్ అని అరవాలనుకుని సభ్యత అడ్డొచ్చి మానేశారు

“నాన్నగారు. ఇంత కట్నం పిచ్చి వున్నవాళ్ళ మరెప్పుడూ ఇంటిగడప కూడా తొక్కనివ్వకండి. చదువు, సంస్కారాలతో పనిలేనివాడితో మనకి పొత్తుకుదరదు .... లక్ష కాకపోతే పది లక్షలు పుచ్చుకుని ఓ మొద్దుని చేసుకోమనండి బడుద్ధాయిని....” అని చీపురు కట్టలేకుండా దులిపేసింది కాంచన.

వీళ్ళద్దర్నీ కలవకుండా మరో అవకాశం ఈ విధంగా కలివిచ్చింది.

“చూడండి రామనాధం మావయ్య గారు ఎంత పెద్ద ఆఫీసరయినా, ఆడపిల్ల అన్నతర్వాత గృహిణిగా అన్ని బాధ్యతలు చేపట్టాలి కదా? మాది పెద్ద కుటుంబం. నల్గురం వున్నవాళ్లం మా వదినలతోపాటు ఇంట్లో వంటా-గింటా లాంటివి చెయ్యాలి .... ఇంట్లో మంచి చెడ్డలు చూసుకోవాలి మా అమ్మ అనారోగ్యం మనిషి....అవిణ్ణి జాగ్రత్తగా చూసుకోవాలి ఇంకో విషయం

నేనే వుద్యోగం చేస్తున్నాను కాబట్టి డబ్బుకూడా నా స్వంతమే అనుకుంటే ఎలా చెప్పండి? నలుగురున్న కుటుంబం. ఏవో అవసరాలు వుంటూ వుంటాయి. జీతం గట్రా నాకిచ్చేస్తే నేనే జాగ్రత్త చేస్తాను పెళ్లయ్యాక డబ్బు తనదీ నాదీ అనేభేదం ఎలావస్తుంది చెప్పండి. అంతా ఒకటే కదా?....." హ్హి హ్హి హ్హి అని నవ్వాడు ఆ భేదం తన ధర్మ సూత్రం అన్నట్లు.

ఏమిటేమిటి? డబ్బు సంపాదించే యంత్రంలాగా, ఇంట్లో పనిచేసేదాని లాగా....ఆహో! తెలివంటే నీదే కదా మహాశయా? ఎంత సుళువుగా మా అమ్మాయిని కట్టుకుని పోదామనుకున్నా వయ్యా? దాని జీతం నీదగ్గర జాగ్రత్త చెయ్యాలా? మా బాబే....ఏవండీ....నా ఖర్చులకి డబ్బు అని అడుగుతే ధర్మ రాజులా ఇస్తాడు కాబోలు .... నీలాంటి మూర్ఖుడిచేతిలో పిల్లను చచ్చినా పెట్టను గాక పెట్టను....పోవయ్యా....అనుకుని సాధ్యమైనంత సగౌరవంగా వచ్చిన దారి చూపెట్టారు ఆ మహాత్ముడికి.

"నాన్నగారూ ఇప్పుడొచ్చిన వాడిది అతితెలివి ఇంట్లో పనికి ఇబ్బంది లేకుండా చాకిరి చెయ్యమని-దానికో అందమైన పేరు 'గృహిణిగా బాధ్యతలు నెరవేర్చడం' అని చెవులకింపుగా చెప్పాడు. మరోవైపునుండేమో నా జీతం కావాలి అని దానికి మరో అందమైన వాక్యాల కూర్పుతో చెప్పాడు. పెళ్లిచూపుల్లోనే ఇన్ని నియమాలు పెట్టాడు తాళికట్టాక చూడాలి. బాబోయ్ ఆ వచ్చే అమ్మాయిని ఆ దేవుడు రక్షించు గాక.." అని హడలిపోయింది కాంచన.

ం ం ం

మొత్తానికి ఎలాగయితేనేం మరో సంబంధం వచ్చింది. అతగాడు బొంబాయి మహానగరంలో ఓ పెద్ద వుద్యోగం చేస్తున్నాడు. ఇప్పటివరకు వచ్చిన వాళ్ళకన్నా మెరుగుగానే కన్పించాడు. పైకి హుందాగా కన్పించాడు ఎక్కువ మాట్లాడలేదు. పిల్లనచ్చిందని ఓ రెండు ముక్కలు మాట్లాడి వెళ్లిపోయాడు. వెళ్తూ వెళ్తూ వీలైనంత త్వరలో తల్లి దండ్రులను పంపుతాను, వాళ్ళు నీతో మాట్లాడ్తారన్నాడు.

వెళ్లేప్పుడు కాంచన కళ్లలోకి చూసి చిన్నగా నవ్వి కళ్లతో ప్రేమసందేశం లాంటిది (అలాంటిదనే అప్పట్లో కాంచన వూహించింది) ఇచ్చి వెళ్లాడు.

అతగాడి మాటప్రకారం అతని తల్లీ తండ్రీవచ్చారు. పిల్లని చూశారు. అన్నీ బాగున్నాయి అనుకున్నారు.

కాంచనప్రాయంగా కట్నం ఇచ్చు కోవాలని అన్నారు....కట్నం ఇవ్వద్దని తండ్రితో చెప్పాలని గింజుకుంది కాని రామనాధంగారు కూతురికాఅవకాశం ఇవ్వలేదు. ఎందుకంటే పరమసత్యాన్ని

ఆడపిల్లకి ఎని విధాల అన్నీ వున్నా .. కట్నం అనేది తప్పదని .... తెల్సుకుని తనపరిధి దాటకుండా కట్నం ఇచ్చుకుని పెళ్లి నిశ్చయించారు.

ఆ తర్వాత పెళ్ళి. మొదలైనవన్నీ చకచకా జరిగిపోయాయి.

అదృష్టవశాత్తు కాంచన ఆఫీసు బ్రాంచి బొంబాయిలో వుండడం మూలాన ఓ నాలుగునెలల్లో తనూ బొంబాయి ఆఫీసుకు ట్రాన్స్‌ఫర్ చేయించుకుంది కాంచన.

ఇద్దరూ కొత్త కాపురం మొదలు పెట్టారు.

అక్కడికి కాంచనని తీసుకెళ్లిన కొత్తలో పార్టీ ఏర్పాటుచేశాడు ప్రభాకర్ ఆఫీసులోవాళ్లంతా కట్ట కట్టుకుని వచ్చారు అందరు ప్రభాకర్ అదృష్టాన్ని వేనోళ్లకాకపోయినా నోరు నెప్పి పుట్టేవరకు పొగిడారు.

"ఆదృష్టం అంటే నీదోయ్ ప్రభాకర్.. మంచి చదువు, ఉద్యోగస్థురాలే కాక అందమైన అమ్మాయిని సంపాదించావు...."

ప్రభాకర్ మొహంలో గర్వరేఖలు వెల్లివిరిసాయి. మరింత ఠీవిగా, దర్జాగా పై సర్దుకున్నాడు పార్టీ సగంలో వుండగా అతని ఫ్రెండ్ ఒంతను పరిగెత్తుకున్నట్లుగా వచ్చాడు.

"కంగ్రాచ్యులేషన్స్ ప్రభాకర్ గారు....విష్‌యు హాపీ అండ్ సక్సెస్ ఫుల్ మారీడ్ లైఫ్ ...." అంటూ కాంచనవైపు చూసిన ఆతగాడు మొహం తెల్లబోయి తర్వాత సంతోషంగా, హృదయపూర్వకంగా....

"అరె....కాంచనా .... మీరా .... వాటె ప్లెసెంట్ సర్‌ప్రైజ్....ఆరోజు మనం విడిపొయ్యాక మళ్లీ కల్సుకోడం అవలేదు. అయామ్ సో హాపీ టు సీ యు ఎగైన్. పోన్లెండి మా ఫ్రెండ్‌తో ముడిపడిం కదా అప్పుడప్పుడు చూస్తుండవచ్చు. ఇక చూసుకోండి ప్రభాకర్. ఇదివరకు రాలేదు, రాలేదనేవారు. ఇప్పుడు శెలవురోజులన్నీ మీ ఇంట్లో నే కాంచనగారు కూడా వున్నారుగా" అని గలగలా మాట్లాడేస్తున్న ఫ్రెండ్‌మాటలకి ప్రభాకర్ మొహంలో రంగులు మారాయి.

కాంచన మొహంలోకి ఓరగా చూశాడు. కాంచన కూడ స్నేహపూరితంగా సరదాగా అతనితో మాటలు కలిపింది.

అంతవరకు భార్యతో సరదాగా కబుర్లు చెప్తున్న ప్రభాకర్ ఒక్కసారిగా ముభావంగా మారిపోయాడు.

అందరూ వెళ్లిపోయాక బట్టలని మార్చుకుంటున్న కాంచనకి భర్తలో వచ్చిన మార్పుకి కారణం ఏమిటో అర్థంకాక తికమకపడింది.

"ఏవండీ .... అలా వున్నారేం?" అని అడిగింది భర్తపక్కలో కూర్చుని.



రెండుక్షణాలు కాంచన కళ్ళల్లోకి తదేకంగా చూశాడు ప్రభాకర్. కాంచన అందమైనదే ... గిరీ ఆకర్షణీయంగా వుంటాడు .... ఇద్దరు ఒకళ్ళనొకళ్లు చూసుకుని ఎంత సంతోషపడిపోయారో... వీళ్ళిద్దరూ....

అతని ఆలోచనలు తొక్కకూడని దారులు తొక్కబోయాయి. దానికి కాంచన మాటలు అతని ప్రస్తుతంలోకి లాక్కొచ్చాయి

"అలా వున్నారేం? తలనొప్పిగా వుందా?" మృదువుగా అడిగింది.

"ఊహూ...." అని రెండుక్షణాలు వూరుకుని "గిరి నీకెలా పరిచయం?" అని అడిగాడు,

"నేను అతనూ ఒకేసారి ఆఫీసర్స్ ట్రైనింగ్‌కు వెళ్లాం. అప్పుడు అతనితో పరిచయం అయింది" ఇప్పుడు అతనివిషయం ఎందుకన్నట్లు చూసింది

"అలాగా...." అని వూరుకున్నాడు. అతని మనోభావాలు తెలియని కాంచన మరింకేమీ మాట్లాడలేకపోయింది. అతనింకేదైనా మాట్లాడ్తాడేమోనని కాసేపు ఎదురు చూసి నిద్రలోకి జారిపోయింది ఆ రాత్రి చాలభాగం గిరి, కాంచనల స్నేహాన్ని ఎన్నోవిధాల, ఎన్నో కోణాల్లోంచి చిత్రీకరించుకుంటూ అర్థంలేని ఆలోచనలతో గడిపాడు ప్రభాకర్.

ఆ మర్నాడు ఎర్రటి కళ్లతో నిద్ర

లేహాడు ఆ రోజంతా అంటీముట్టనట్టు గానే ప్రవర్తించాడు. అతని ప్రవర్తన ఏమిటో అర్థంకాక, అతన్నెలా అడగాలో తెలియక కాంచన కూడా అస్థిమితంగా తయారయింది. రెండురోజుల తర్వాత తిరిగి మామూలుగా మసలసాగాడు ప్రభాకర్. అతని ప్రవర్తనకి అర్థం కల్పించలేదు కాంచనకి.

నాలుగయిదురోజులు గడిచిపోయాయి.

ఆరోజు సాయంత్రం కాంచన ఆఫీసునుండివచ్చేసరికి ప్రభాకర్ ఇంకా రాలేదు. టీతాగి మొహం కడుక్కొని చల్లగాలికోసం బాల్కనీలో నిలబడింది. పక్క బాల్కనీలో ఓ ముప్పైఏళ్ళతను కాంచన్ని గమనిస్తున్నాడు. ఇది గమనించిన ఆమె తల మరోవైపుకి తిప్పుకుని ట్రాఫిక్‌ని చూడడంలో మునిగిపోయింది. అయిదు నిమిషాలు గడిచింది.

"ఎక్స్‌క్యూజ్‌మి....." అన్న మాటలకి తలతిప్పిచూసింది కాంచన. పక్క బాల్కనీ అతను! ఆమె తనవైపు తిరగ్గానే చిరునవ్వుతో—

"మీరు వచ్చినప్పట్నుంచిపరిచయం చేసుకుందాం అనుకుంటున్నాను. మీ వారిని పరిచయం చేసుకున్నానులెండి. మీరే ఆఫీసులో పని చేస్తారు?...." అతని మాటల్లో స్నేహం-సంస్కారం తప్ప మరేమీ లేవు .... అందుకే ఆమె కూడా స్నేహపూరితంగా జవాబిచ్చింది ఫలానా ఆఫీసులో అని.

"అరే .... అయితే రోజూ మీరు, నేను ఒకేవైపు వెళ్ళాలి. మీ ఆఫీసు దాటేకే మా ఆఫీసు 'ఫలానా' ఆఫీసు మాది" అని చెప్పాడు. ఇలా ఇద్దరూ ఆఫీసుల గురించి మాట్లాడుకుంటున్నారు. పదినిమిషాలు గడిచాక ప్రభాకర్ వచ్చాడు. వస్తూనే కాంచన పక్కతనితో సంభాషించడం చూశాడు.

కనీసపు మర్యాదైనా పాటించకుండా వాళ్ళిద్దర్నీ తప్పించుకుని లోపలికి వెళ్ళబోతుంటే బాల్కనీ అతనే విష్ చేశాడు 'గుడ్ ఈవినింగ్' అంటూ ముక్తసరిగా గొణిగి కాంచనవైపు చూడకుండా లోపలికి దూసుకువెళ్ళిపోయాడు. తెల్లబోయిన కాంచన బాల్కనీ అతనికి క్షమాపణచెప్పి భర్తని అనుసరించింది. లోపలికొచ్చిన ఆమెనిపట్టించుకోకుండా బూట్లువిప్పి బట్టలు మార్చుకున్నాడు. కాంచన ఇచ్చిన టీ సిప్‌చేస్తూ పేపర్ చూడసాగాడు. రెండు మూడుసార్లు కాంచనే అతనితో మాటలు కలపడానికి ప్రయత్నించింది. కన్నెత్తయినా చూడకుండా ముక్తసరిగా మాట్లాడాడు. అతనిలో ఈ విపరీత మార్పుకి దాదాపు స్థంభించిపోయింది కాంచన.

ఏమిటీ మనిషి? కొత్త కాపురం మొదలుపెట్టి పట్టుమనిపదిహేనురోజులు నిండలేదు. అందులో సగంరోజులు ప్రభాకర్ మూతి బిగింపులోనే గడిచిపోయాయి. అలకకైనా అర్థం వుండద్దు? కారణం అవసరం లేదా? పోనీ పొరపాటేదైనా జరుగుతే మొహం మీద అడగొచ్చు కదా? అత్తగారిలాగా ఈ మూగ సాధింపేమిటి? మొదటిసారిగా

అతని అర్థంలేని చేష్టలకి కాంచనకి కోపంలాంటిది కలిగింది.

రెండు రోజులు గడిచాయి. తిరిగి మామూలు మనిషయ్యాడు ప్రభాకర్.

ఈసారి ప్రభాకర్ దగ్గరికి వచ్చినా మనస్ఫూర్తిగా మాట్లాడలేకపోయింది ఆమె. ఎందుకలా సాధించారని అడగాలని నాలిక చివరిదాకా వచ్చింది. బలవంతాన అణచుకుంది కాంచన. అడగ బుద్ధి వెయ్యలేదు.

మరో నాలుగురోజులు గడిచాయి. ఆ రోజు ఆదివారం.

కాంచన, ప్రభాకర్ సినిమాకెళ్ళారు. టికెట్లు తీసుకురావడానికి ప్రభాకర్ వెళ్ళాడు. అతనటు వెళ్ళాడో లేదో గిరి ప్రత్యక్షమయ్యాడు కాంచనముందు. గిరి చాలా యాక్టివ్. అందరితోటి ఎంతో కలుపుగోలుగా వుంటాడు. ఎవరికైనా వుపకారం చేస్తాడు కాని అపకారం అంటే గిట్టని మనిషి.

ఆమెతో గలగలా మాట్లాడేస్తున్నాడు గిరి. అతని ఎదురుగా వున్న వాళ్ళెవరూ ఒక్క అయిదు నిముషాలకంటె ఎక్కువ నవ్వకుండా ఉండలేరు. నవ్వుతూ వింటోంది కాంచన. మరో పది నిముషాలకి టికెట్లు తీసుకొచ్చిన ప్రభాకర్, గిరి, కాంచనలు సంభాషణ లహరిలో అతన్ని గమనించలేదు. రెండు క్షణాల తర్వాత తలతిప్పిన కాంచన వులిక్కిపడింది. అయిదారడుగుల దూరంలో నిలబడి తీక్షణంగా చూస్తున్నాడు. ఆ చూపులో ఈర్ష, కోపం, అసహనం కలగా పులగంగా వున్నాయి. పెదాలు బిగిసిపోయాయి.

అంతే.... కాంచనకంతా అర్థం అయిపోయింది. ఇన్నిరోజులు అతని అర్థంలేని కోపానికి అర్థం తెలిసిపోయింది. కాంచన తప్పు చూపిందని గమనించి, తన్నితాను సంభాళించుకుని వాళ్ళదెస అడుగువేసాడు. పిక్చర్ బిగిన్ అయ్యేసమయానికి గిరి వెళ్ళిపోయాడు. కాంచన వూహించినట్లుగానే అతను ముభావంగా వుండిపోయాడు.

మరో మగాడితో మాట్లాడ్తే సహించలేని బలహీనత అతనిలో బలంగా వూడలు వేసివుందని గ్రహించింది. అందుకే ఆరోజు రిసెప్షన్‌లో గిరి కన్పించాక, రెండోసారి బాల్కనీలో అతనెవర్తోనో మాట్లాడాక అతని మౌనవ్రతాల ఫలితాలు తను చూసింది. మళ్ళీ ఈరోజు అదే రిపీట్ అవుతోంది. ఓరి భగవంతుడా ఇంత చదువుకుని, ఇంత పెద్ద వుద్యోగం చేస్తూ, ఇంత మహానగరంలో తిరుగుతూ, సంస్కారవంతులనబడే పెద్దమనుషులమధ్యలో వుంటూ ఇతనికింత ఇరుకు మనస్సు ఎలా వచ్చింది?

తనూ చదువుకుని, వుద్యోగం చేస్తోందే... మగవాళ్ళతో మాట్లాడకుండా వుంటుందని ఎలా వూహించగలడు? తను ఆడపిల్లలతో మాట్లాడకుండానే వుంటున్నాడా? అతనిలో మరో బలహీనత కూడా చూడగల్గింది కాంచన. ఇలాంటి వాళ్ళు పైకి ఎంతో సంస్కారవంతుల్లాగా, ఎంతో వున్నత భావాలుగల వాళ్ళల్లాగా ప్రవర్తించటానికి ప్రయత్నిస్తారు. కాని తమదాకా వచ్చే

సరికి మడిబట్ట కట్టుకుని తనవారు వుండాలని కనీసంగా కోరుకుంటారు. పైకి మాత్రం చెప్పుకోడానికి అందమైన భార్య, బాగా చదువుకున్నది, వుద్యోగం చేస్తున్నది కావాలి....

కాని షోకేసులో బొమ్మలాగా వాళ్ల అనుకున్నట్లుగా, వాళ్ళ ఇష్టానుసారంగా ప్రతి కదలిక వుండాలి. లేకపోతే సహించలేరు. పైకి కక్కలేరు మింగలేరు. ఇలా మనసాధింపులు సాధిస్తారు.

రెండో రకం-సూటిపోటీ మాటలతో జీవితాన్ని నరకప్రాయం చేస్తారు. ముందు ముందు తన జీవితం ప్రభాకర్‌తో ఎలా వుండబోతుందో వూహించుకో గల్గిన కాంచన మనస్సు ఒక్కసారిగా గడ్డకట్టుకుపోయింది. ఇలాంటి మనస్తత్వంతో కాపురం తల్చుకుంటే ఆమె మేను జలదరించింది.

ఏం చెయ్యాలి తను? దీనికేనా పరిష్కారం వుందా? పోని వుద్యోగం మానేస్తే దాంతో తృప్తి పడ్తాడా ప్రభాకర్? ఊఁ హూ... ఇలాంటి మనుషులకి బయట ప్రపంచంలో 'షో' లు ఎక్కువ చేస్తాను. తన భార్య ఆఫీసర్ అనైనా చెప్పుకోడానికి తన వుద్యోగం మాననియ్యడు.

ఇలాగే పరపురుషుడితో మాట్లాడినప్పుడల్లా మూగనోముతో సాధిస్తుంటాడు. భగవాన్....చివరికి నన్నిలాంటి మనిషి పాల పడేశావా? కాంచన మనస్సు ఆక్రోశించింది. అందం, చదువు హోదా వున్న తన జీవితం ఎంతో ఆశాపూర్వకంగా నిండుగా వుంటుందని ప్రభాకర్ రాకతో మనస్సుని తను పూర్తి నిర్లిప్తత ఆవరించగా, కలత చెందిన మనస్సుని సంబాళించుకోడానికి వ్యర్థ ప్రయత్నం చేసింది ఆఫీసర్ కాంచన ★